## ప్రథమ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

**-జిల్లా ఉపాధి కల్పన అధికారి అబ్దుస్ సుభాన్**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబరు 13, ప్రభాతవార్త:** ప్రథమ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్ హైద్రాబాద్ నందు శిక్షణ తరగతులకు దరఖాస్తుచేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి అబ్దుస్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎంప్లాయ్ మెంట్‌కార్యాలయం ఐటిఐ క్యాంపస్ వికారాబాద్‌లో నవంబర్ 16 శనివారం ఉదయం 10.30 గంటల కు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రథమ్‌స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సుమారు 200 మందికి డిజిటల్, తరగతి గది శిక్షణ అనుభవజ్ఞులైన నిపుణులచే శిక్షణ, శిక్షణ పొందిన వెంటనే ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వీటికి సుమారు 18 నుంచి 35 సంవత్సరాల వరకు అందరు అర్హులని అన్నారు. ఇట్టి శిక్షణ తరగతులకు పదవ తరగతి,ఇంటర్, డిగ్రి, ఐటిఐ విద్యార్హత కలిగియుండాలని అన్నారు. ఎలక్ట్రికల్, సోలార్, డాటా ఎంట్రి ఆపరేటర్, నర్సింగ్, శిక్షణ తరగతులు 45 రోజులుహైద్రాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగ యువతసద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇతర వివరము లకు జాబ్ మేళా నిర్వహకుడు మియాసాబ్ 9676047444ను సంప్రదించవచ్చని తెలిపారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## లగచెర్లలో ఇలాంటి సంఘటన జరడగం దురదృష్టకరం

**-కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి**



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

**దుద్యాల, నవంబరు 13, ప్రభాతవార్త:** లగచర్లలో అధికారులపై దాడులు చేయడం దురదృష్టకరమని కోడంగల్ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డిఅన్నారు. బుధవారం దుద్యాల మండలంలోని లగచెర్లలో తిరుపతిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూగత 60,70 సంవత్సరాల నుంచి వెనుకబడిన కోడంగల్ ప్రాంతానికి ఎమ్మెల్యే అయిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఈ ప్రాంత వాసులఅదృష్టమని అన్నారు. ఇండస్ట్రీస్ విద్యాసంస్థలు ఈ ప్రాంతానికి తీసుకురావడానికి సహచర మంత్రులను ఒప్పించి ఎంతోగానో తాపత్రయపడ్డారనిఅన్నారు. కాని బిఆర్ఎస్ నాయకులు కేటిఆర్, హరీష్‌రావులు ఈ ప్రాంతం ఎట్టి పరిస్తితుల్లో అభివృద్ది కాకుడదనే దురుద్దేశంతో కుట్రలు చేస్తున్నారనిఈ ప్రాంతంలో కొందరు యువకులను చేరదీసి వారికి ఆర్థికంగా సాయం చేసి ఇలాంటి గొడవలు చేయడానికి ప్రేరేపిస్తున్నారని అన్నారు. హరీష్‌రావు,కేటిఆర్ పది సంవత్సరాలు అధికారంలో ఉండి వారి నియోజకవర్గాలకు వేల కోట్లు దోచుకొని అభివృద్ది చేసుకున్నారని అన్నారు. ఇక్కడ ఉండే కొందరుఅల్లరి మూకలను, కేటిఆర్, హరీష్‌రావులు చేరదీసి దాడులు చేస్తున్నారని, వారి ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లో సఫలం కాదని అన్నారు.వారు చేస్తున్నకుట్రలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇక్కడి ప్రాంత వాసులు ఇండస్ట్రీస్‌కు సహకరించి భూములు కోల్పోతున్న రైతులు తమకు పరిహారం పెంచాలన్న ఇంకేమైన వసతులు కల్పించాలన్న ముఖ్యమంత్రికి గాని, తమను గాని, కలెక్టర్‌కు గాని విన్నవించాలనిఅన్నారు. అరెస్టు చేసిన వారిలో దాడికి సంబందంలేని వారిని విచారించి వదిలేయాలని, దాడిలో పాల్గోన్న అందరిని అరెస్టు చేసి చట్టపరమైనచర్యలు తీసుకోవాలని అన్నారు.

## గ్రూప్-3 పరీక్షలు సజావుగా జరిగేలా విధులు నిర్వహించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

**వికారాబాద్,నవంబర్ 13, ప్రభాతవార్త:** పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గ్రూప్-3 పరీక్షల్లో ఎలాంటి తప్పులకు తావునీయకుండా సజావుగా జరిగేలా విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. బుధవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షలకు సంబంధించి చేపట్టాల్సిన విధులు, జాగ్రత్తలపై ఉన్నతాధికారులతో కలిసి కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్ కార్యాలయ సముదాయంలో చీఫ్ సూపరింటెండ్స్, రూట్ ఆఫీసర్స్, బయోమెట్రిక్ అధికారులు, పరిశీలకులు, ఇన్విజిలేటర్లు శిక్షణ పొందుతున్న అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు, మార్గదర్శకాలను అందించారు. అనంతరం అధికారులు ఉద్దేశించి అదనపు కలెక్టర్ సుదీర్ మాట్లాడుతూ, జిల్లాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షలకు 10196 మంది అభ్యర్థులు హాజరు అవుతున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు 31 కేంద్రాలను గుర్తించగా అందులో వికారాబాద్ మండలంలో 14, తాండూర్‌లో 11, పరిగిలో 5 అదేవిధంగా పూడూరు మండలంలో 1 కేంద్రంలో పరీక్షలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంతోమంది నిరుద్యోగ యువత దీర్ఘకాలంగా పరీక్షలకు సిద్ధమవుతున్నారని, ఇలాంటి కీలకమైన పరీక్షను సవాల్ గా తీసుకొని అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు ఎలాంటి తప్పిదాలు చేసిన తీవ్రమైన చర్యలు ఉంటాయనే విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు. ఇప్పటికే పరీక్షా విధులకు కేటాయించిన అధికారులకు ఎలాంటి మినహాయింపు ఉండదని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు తీసుకురాకుండా ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి పంపించాలని ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పూర్తి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా అభ్యర్థులను తనిఖీ చేసే క్రమంలో కచ్చితంగా మహిళా సిబ్బంది, మహిళా పోలీసులు ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రానికి గంట ముందే రావడానికి సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు. గ్రూప్-3 పరీక్షలు నవంబర్ 17న రెండు విడతలుగా పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు, రెండవ విడత మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 18వ తేదిన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అభ్యర్థులు పరీక్షా సమయానికి గంట ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వచ్చేలాగా ప్రణాళికతో ఉండాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్, శిక్షణ కార్యక్రమంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ రీజినల్ కోఆర్డినేటర్లు అరవింద్ రెడ్డి, నరేంద్రబాబు, డి.ఎస్.పి జానయ్య ,హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నేహమత్ అలీలు పాల్గొన్నారు.

## పరిగి పోలీస్ స్టేషన్ ముందు హడావిడి

**-పరిగి పోలీస్ స్టేషన్లో పట్నం నరేందర్ రెడ్డిని గంటపాటు విచారించిన పోలీసులు**

**పరిగి నవంబర్ 13 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కొడంగల్ నియోజకవర్గం లగిచర్ల గ్రామంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , కొడంగల్ అథారిటీ డెవలప్మెంట్ చైర్మన్ వెంకట్ రెడ్డి పై జరిగిన దాడి కేసులో భాగంగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని బుధవారం ఉదయం హైదరాబాదులో అరెస్ట్ చేసి, వికారాబాద్ ఎస్పీ ఆఫీసు లో విచారణ అనంతరం, పరిగి పోలీస్ స్టేషన్ కు పట్నం నరేందర్ రెడ్డిని తరలించిన నేపథ్యంలో పరిగి పోలీస్ స్టేషన్ ముందు బుధవారం ఉదయం నుండి హడావిడి నెలకొంది .. పరిగి పోలీస్ స్టేషన్ ముందు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, వికారాబాద్ ఎస్పీ ఆఫీస్ నుంచి పట్నం నరేందర్ రెడ్డిని మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పరిగి పోలీస్ స్టేషన్ కి తరలించారు.. దాదాపు గంట పాటు పరిగి పోలీస్ స్టేషన్లో నరేందర్ రెడ్డిని విచారించిన అనంతరం, భారీ బందోబస్తు నడుమ పట్నం నరేందర్ రెడ్డిని కొడంగల్ కోర్టులో హాజరు పరిచేందుకు పోలీసులు తరలించారు.. అధికారులపై దాడి చేసిన సంఘటనలో నిందితులు పలువురిని పరిగి పోలీస్ స్టేషన్ లో విచారణ చేశారని సమాచారం.

## సమగ్ర సర్వే గురించి ముందుగానే కుటుంబాలకు తెలపాలి

**-ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్యదేవరాజన్**

**-మేడ్చల్ కలెక్టరేట్‌లో సమగ్ర సర్వే, ధాన్యం సేకరణ అంశాలపై సమీక్ష**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో సమగ్ర సర్వే, ధాన్యం సేకరణలపై సమీక్షించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్యదేవరాజన్,పాల్గొన్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, పలువురు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 13, ప్రభాతవార్త**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విషయంపై కుటుంబాల వారికి ముందుగానే తెలిపి అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకునే విధంగ చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్యదేవ రాజన్ నోడల్ అధికారులకు సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో సమగ్ర సర్వే, ధాన్యం సేకరణ అంశాలపై ఆమె విచ్చేసి సమీక్షించారు. ఈ సందర్భంగ జిల్లాకు ప్రత్యేక హోదాలో విచ్చేసిన దివ్యదేవ రాజన్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో అందుబాటులో లేని కుటుంబ సభ్యులకు ముందుగానే సర్వే సమయాన్ని అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో పెట్టుకునేలా ఎన్యుమరేటర్ల ద్వారా ఇంటింటికి తెలిపేందుకు చర్యలు తీసుకోవాలని సర్వే నోడల్ అధికారులను ఆదేశించారు. ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండ ఫామ్స్ నింపాలని, సూపర్‌వైజర్లు పరిశీలించాలని అన్నారు. ప్రణాళిక ప్రకారం సర్వేను షెడ్యూల్ చేసుకుని నిర్వహించాలన్నారు. జిల్లాలో వలసదారులు ఎక్కువగా ఉంటారని, ఎక్కడైనా ఒకే చోట నమోదు చేసుకునేలా చూడాలన్నారు. నోడల్ అధికారులు క్షేత్రపర్యటన చేయాలని సర్వే గురించి ఆమె ఆరా తీశారు. జిల్లాలో జరుగుతున్న సర్వే గురించి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆమెకు వివరించారు. జిల్లాలో గ్రూపు-3పరీక్షలు ఉన్నందున సర్వే కోసం మరి కొంత సమయం పడుతుందని కలెక్టర్ ఆమెకు వివరించారు. ధాన్యం కొనుగోలు సేకరణ విషయంపై ఆమె అధికారుల నుంచి ఆరా తీశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీఓలు సైదులు, శ్యాంప్రకాశ్, డిఆర్‌డిఓ సాంబశివరావు, జిల్లా సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తులో జోగుతున్న యువత

**-చిత్తవుతున్న బంగారు భవిత**



స్మోకింగ్ చేస్తున్న యువత

**నవాబుపేట నవంబర్ 13 ప్రభాతవార్త:**

బంగారం లాంటి కలలు కంటూ వాటిని సాంకారం చేసుకునేందుకు అహర్నిశలు కృషి చేయాల్సిన యువత కొందరు నిత్యం మత్తులో తులతూగుతూ బంగారం లాంటి భవిష్యత్తును చిత్తు చేసుకుంటున్న వైనం తల్లితండ్రులు శోక సముద్రంలో ముంచేత్తున్న తీరు ఈ దేశభవిష్యత్తును ప్రశ్నిస్తుంది. యువతే దేశ భవిష్యత్తుకు ఆధారమని వారు సన్మార్గంలో నడిచినప్పుడే దేశ ప్రగతి చక్రాలు ముందుకు సాగుతాయని నినధించిన మేధావుల ఆశలకు భంగం కలుగుతోందనే భావన స్పూరిస్తుంది. ఆర్థిక వనరులు మెరుగుపడితే అది మరింతగా ముందుకు నడిపించేదిగా ఉండాలి తప్ప వినాశనానికీ దారి తీయకూడదు. ప్రస్తుతం రియలేస్టేట్ రంగం పరుగులు పెడుతొంది. ఈ తరుణంలో రాజదాని పరిసర ప్రాంతంలో ఆర్థిక పరిపుష్టి ఏర్పడింది. ఎకరం భూమి కోట్ల రూపాయలు పలకడంతో ధన లక్ష్మి ఆవరించింది. దీంతో కొందరు యువతకు చేస్తున్న చేడు చేష్టలకు ఆజ్యం పోసినట్లయింది. ఎకరం భూమి విక్రహిస్తే కోట్లాది రూపాయలు సమకూరుతున్నాయి. దీంతో సుదూర ప్రాంతంలో స్థిరాస్తి కొనుగోలు చేసినా భారీ మొత్తం డబ్బు మిగులు తోంది. ఈ నేపథ్యంలో విచ్చల విడిగా ఖర్చుచేయడం ప్రారంభించారు. చేడు వ్యసనాలకు అలవాటుపడి ఆరోగ్యం పాడు చేసుకుని ఎంతో జీవితాన్ని అనుభవించాల్సి న యువత అనారోగ్యానికి గురై మంచానికీ పరిమితమై జీవితాలను ముగిస్తున్న తీరు భయాందోళన కలిగిస్తోంది. ఈ దురాచారం మండలానికీ సమీపించింది. ఇక్కడ కూడా ప్రధాన రహదారుల ప్రక్కన భూములు కోట్ల రూపాయలు పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఆర్థిక పరమైనా అభివృద్ధి జరుగుతోంది. దీంతో కొందరు యువకులు వ్యసనాలకు చేరువై ఆయుష్యరేఖను చెరిపేసుకుయటున్నారు. అయితే ఇక్కడ చెడు వ్యసనాలకు ఆర్థిక పరిస్థితులే కారణమని భావించాల్సి న అవసరం లేదు. ఎందుకంటే దినకూలీల కుటుంభాలకు చెందిన కొందరు. యువకులు కూడా చెడు వ్యసనాలకు తీసిపోవడం లేదు. ఉన్నదాంట్లో చెడు వ్యసనాలను ఆస్వాదిస్తున్నారు. మద్యం సేవించడం, ఇతరాత్ర మత్తు కలిగించే వాటిని ఆస్వాధించడంలో సిద్ద హస్తులు కోకోళ్ళలుగానే ఉన్నారు. ముఖ్యంగా నికోటిన్ భారిన పడిన యువత రోజురోజుకు పెరుగుతోంది. టీ హోటళ్ళ, పాన్ షాపుల వద్ద నికోటిన్ భానిసలు చాటుమాటున కాల్చేసిన వేలాది సిగిరేట్ ముక్కల సాక్షిగా ఎంత భయంకరంగా యువత వాటి భారీన పడిందో అర్థం చేసువచ్చు. మూతిమీద మీసాలు కూడా సరిగా మొలవని మైనర్లు కూడా అధిక సంఖ్యలో నికోటిన్ వ్యసనాలకు భానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈకు సాంసృతి గ్రామాలను కూడా ఆవహించింది. సిగరేట్ కాల్చడం, బీర్లు తాటడం, అమ్మాయిలను వేధించడం లాంటి చేష్టలు చేయడం వారికీ గోప్పగా తోచడం శోచనీయం. ఈ లాంటి పనులు చేసి వినాశనమైన వారు కళ్ళముందు కనిపించినా వారిలో మార్పు చోటుచేసుకోవడం లేదు. మధ్యం మత్తులో వాహనాలు నడిపించి రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారిలో యువకులే అధికంగా ఉండటం ఆందోళక కలిగిస్తోంది. మండలంలో గాంజాయి వ్యసన పరులు కూడా ఉన్నారని రెడిమేడ్డా సంబంధించిన సిగిరేట్లు లభిస్తున్నానే వదంతులు కూడా వినిపిస్తున్నాయి. యువత మేలుకోక పోతే జరిగే నష్టం యావత్తు సమాజం మీద ప్రభావం పడనుంది. ఈ వినాశనాన్ని కాలమే సరిదిద్దాలి.

## కూలీలు దొరక్క ఇబ్బంది పడుతున్న రైతులు

**-కూలీల కోసం రైతుల వెతుకులాట**

**-చేతికొచ్చిన పత్తి, వరి పంటలు**



కూలీలు దొరకాక పొలంలోనే ఉన్న పత్తి పంట

**ధారూరు, నవంబర్ 13, ప్రభాతవార్త :** విత్తనాలు వేసే నాటి నుంచి పంట ఇంటికి చేరేదాకా కూలీలు ఉండాల్సిందే.. ఆధునిక కాలంలో వ్యవసాయంలో రైతుకు అందుబాటులోకి ఎన్నో పరికరాలు వచ్చాయి. కానీ పత్తి సాగుచేసిన రైతులకు మాత్రం ఎలాంటి పరికరాలు అందుబాటులో లేకపోవడంతో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. పత్తి ,వరి పంటలు ఒకేసారి చేతికి రావడంతో స్థానికంగా ఉన్న కూలీలకు డిమాండ్ పెరిగింది. రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు పో రోజుకు 300 ంచి 500 వరకు డిమాండ్ చేస్తున్నారు. అయినా స్థానికంగా కూలీలు దొరకడం లేదు. కూలీలు దొరకక పోవడంతో పత్తి పొలంలోనే మగ్గుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న కాలంలో కూలీల కొరత ఇలానే ఉంటే వ్యవసాయం చేయడం కష్టమేనని పలువురు రైతులు వాపోతున్నారు. కిలోల చొప్పున తీస్తున్న కూలీలు రోజువారి కూలీ కాకుండా వ్యవసాయ ప ంలు సకాలంలో పూర్తి కావాలని, కిలో పత్తి తీస్తే రూ.11 ంచి రూ.14 వరకు చెల్లిస్తూ కొందరు రైతులు సకాలంలో ప ంలు పూర్తి కావాలని పత్తి పంట ం తీపిసుకుంటున్నారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, వరికోతలు ప్రారంభంకాగా, దిగుబడులు వస్తున్నాయి. అయితే పలు గ్రామాల వరి ధాన్యం కొ ంగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దీంతో కోత కోసిన రైతులు ధాన్యాన్ని కొ ంగోలు కేంద్రాలకు తరలించి ఆరబోస్తున్నారు. కాగా, మంగళవారం ఉదయం ఎండ ఉండగా, సాయంత్రానికి వాతావరణంలో మార్పు చోటుచేసుకొని ఒక్కసారిగా చల్లబడింది.

## లగచర్ల దాడి కేసులో 47 మంది గుర్తింపు

**కొడంగల్,నవంబర్ 1ప్రభాతవార్త :** దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోపాటు అధికారులపై దాడి చేసిన సంఘటనలో మొత్తం 47 మందిని నిందితులుగా పోలీసులు గుర్తించారు.అందులో మంగళవారం రాత్రి 16 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచిన అనంతరం పరిగి రిమాండ్‌కు తరలించారు.మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు మరో 4గురిని బుధవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు.దాడి సంఘటనలో ఇప్పటివరకు 21 మందిని జ్యాడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.మిగిలిన 26మంది నిందితుల కోసం నాలుగు బృంధాలతో గాలిస్తున్నారు.కాగా బుధవారం అరెస్టు చేసిన వారిలో ఏ1 మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి,ఏ21 బోగమోని మహేష్,ఏ22 బ్యాగరి విశాల్,ఏ24 నిరటి సాయిలు,ఏ27 నిరటి రమేష్‌లను రిమాండ్ తరలించారు.కాగా మంగళవారం రాత్రి రిమాండ్‌కు తరలించిన వారిలో ఏ3 ఎదురింటి శివకుమార్,ఏ11 మేలారం విష్ణువర్దన్‌రెడ్డి,ఏ14 హీర్యానాయక్ ,ఏ15 పతీవత్ శ్రీను,ఏ16 పతీవత్ ప్రవీణ్,ఏ17 పతీవత్ వినోద్, ఏ18 రాథోడ్ వినోద్,ఏ19 జర్చాల హీరాయనాయక్,ఏ20 బాస్యా నాయక్,ఏ23 బ్యాగరీ యాదయ్య,ఏ25 దోరేమోని రమేష్,ఏ26 కావలి రాఘవేందర్,ఏ28 లక్ష్మయ్య,ఏ29 నీలి రవి,ఏ30 శ్రీశైలం,ఏ31 బాలకిష్టయ్య తదితరులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు ఘన స్వాగతం

**-బిసి జనాభా గణాంకాల సేకరణకు కేంద్ర, రాష్ట్ర సలహాలు, సూచనలు తీసుకుంటాం.**

**-ప్రభుత్వంకు త్వరలో నివేధిక అందజేస్తాం : బూసాని వెంకటేశ్వర్‌రావు.**





డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సి. నారాయణరెడ్డి.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, నవంబర్ 13 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన కోసం రాజకీయంగా వెనుబడిన వర్గాల(బీసీ) జనాభా గణాంకాల సేకరణలో భాగంగా బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనమునకు చేరుకున్న డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి సైదులు ఐఎఫ్ఎస్, జిల్లా యంత్రాంగం తరపున జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్‌తో కలిసి స్వాగతం పలికారు. జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వరరావు, సెక్రెటరీ సైదులు ఐఎఫ్ఎస్, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్‌లతో కలిసి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి బహిరంగ చర్చను ఏర్పాటు చేశారు. ఈ బహిరంగ చర్చలో చైర్మన్ బూసాని రిజర్వేషన్ల పెంపు అంశంపై ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నివేధిక అందజేస్తామని తెలిపారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, బీసీ కమీషన్, బీసి సంఘాల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన కోసం రాజకీయంగా వెనుకబడిన వర్గాల(బీసీ) జనాభా గణాంకాల సేకరణలో భాగంగా బుధవారం బీసీ ఫెడరేషన్ చైర్మన్ మల్లేష్ యాదవ్, విశ్వకర్మ సంఘం నుండి బ్రహ్మచారి, సెల్వేజ్ సెల్వాచారీ, ఆదిమూలం వెంకటాచారీ, రంగారెడ్డి జిల్లా పూలసంఘం సదానందం, పగడాల యాదయ్య, సిపిఐఎం వడ్డెర సంఘం మారెయ్య, వడ్డెర సంఘం రవి, మేదర సంఘం గంగాధర్, ఉప్పర సంఘం సతీష్ సాగర్, మత్స్యకారుల సంఘం గొరెంకల నర్సింహ్మా, మేదర సంఘం అందూరి శివ, ఎంబిసి ఫౌండర్ నాగేంద్ర, తెలంగాణ రజక సంఘం రాజ్ కుమార్‌ల నుండి వినతులు, సలహాలు, సూచనలు తీసుకోవడం జరిగిందన్నారు. కమీషన్‌కు అందిన సలహాలు, వినతులు, అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వంకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ బహిరంగ చర్చో స్థానిక ప్రజాప్రతినిధులు, పలు బిసి సంఘాల నాయకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్



విద్యార్థులచే వందన సమర్పణ స్వీకరిస్తున్న కలెక్టర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబరు 13, ప్రభాతవార:** విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలోను రాణించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లాలోని శివారెడ్డి పేట్ ( అనంతగిరిపల్లి) సాంఘీక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల,కళాశాలఆవరణలో 10వ జోనల్ స్థాయి పోటిలలో పాల్గొనే క్రీడాకారులతో మాట్లాడారు. వివిద పాఠశాల విద్యార్థులు మార్చ్ పాస్ట్ ద్వారా కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్బంగా క్రీడాకారు లతో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో ముందుండా లని, క్రీడల వల్లశారీరక దృఢత్వంతో పాటు మానసికంగా బలపడతారని అన్నా రు. క్రీడా పోటిల్లో పాల్గొనే విద్యార్థులు గెలుపొంది జిల్లాకు మంచి పేరుతీసుకు రావాలని, క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. క్రీడల్లో తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచిం చారు. క్రీడల్లో రాణించినట్లయితే ఉద్యోగాల్లో ప్రాదాన్యాత కల్పించడం జరగు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, సాంఘీక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల సాంఘీక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సదర్ ఘటనపై ఎమ్మెల్యే గుస్సా



సదర్ వేడుకల్లో జరిగిన సంఘటనపై చర్చిస్తున్న ఎమ్మెల్యే

**షాద్‌నగర్‌నవంబరు 13, ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన సదర్ వేడుకల్లో ఘర్షణలు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరా తీశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యాదవ సంఘం సీనియర్ నేతలు, స్థానిక పోలీసులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. సదర్ వేడుకలో కొంతమంది అల్లరి మూకలు ఘర్షణ పడి యాదవుల మధ్య చిచ్చు పెట్టడానికి రాజకీయంగా ప్రయత్నించారని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని పోలీసులకు సూచించారు. వేడుకల సందర్భంగా ప్రముఖుల ప్రసంగాల అనంతరం ఘర్షణ జరిగిన తీరుపై యాదవ సంఘం నేతలను అడిగి తెలుసుకున్నారు. ఏ పండగ అయినా ఐక్యమత్యం కోసం జరుపుకుంటామని, అలాంటి పండగల నేపథ్యంలో స్వలాభం, రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని వాడుకుంటామంటే చట్టం చూస్తూ ఊరుకోదన్నారు. షాద్‌నగర్ సదర్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ సంఘటనపై యాదవ సంఘం నేతలే నిర్ణయం తీసుకొని భవిష్యత్తును తమకు అనుకూలంగా మార్చుకోవాలన్నారు. అక్కడి పరిస్థితుల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టినట్లు పోలీసులు ఎమ్మెల్యే దృషికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ విజయ్ కుమార్, యాదవ సంఘం నేతలు యాదయ్య యాదవ్, బక్కన్న యాదవ్, గున్న భీమయ్య యాదవ్, దంగు శ్రీనివాస్ యాదవ్, రఘునాథ్ యాదవ్, గోద మాధవులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నారంలో రూ.6లక్షలు చోరీ

**- 3 రోజుల క్రితం దొంగతనం జరిగినట్లు అనుమానం.**

**- పెళ్లికి వెళ్లిన ఇంటి యాజమాని**

**షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 13, (ప్రభాతవార్త) :** కిరాణా షాపును నడుపుకుంటూ వచ్చిన ఆదాయంతో జీవిస్తున్న ఓ ఒంటరి మహిళ ఇంట్లో దాచుకున్న 6 లక్షల రూపాయల నగదును దొంగలు కొట్టేశారు. ఈనెల 9వ తేదిన బూర్గుల గ్రామంలో తన ఆడబిడ్డ కుమారుడి పెళ్లి ఉందని అన్నారం గ్రామానికి చెందిన బొక్క లక్ష్మమ్మ అనే మహిళ ఇంటికి తాళం వేసి బూర్గులకు వెళ్లింది. అనంతరం 13వ తేదిన తిరిగి ఇంటికి వచ్చిన ఆమెకు ఇంటి ముందు వేసిన తాళం వేసినట్టుగానే ఉన్నప్పటికీ ఇంటి వెనకాల నుంచి దొంగలు వచ్చి ఓ సెల్ఫ్‌లో డబ్బాలో దాచిన రూ.6లక్షల నగదును దోచుకెళ్లారు. బీరువాలో పెట్టకుండా ఒక డబ్బాలో పెట్టి సెల్ఫ్‌లో దాచిన నగదును దొంగలు దొంగిలించుకుపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 10వ తేదిన రాత్రి సమయంలో ఇంటి వద్ద కొంత అలజడి జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అదే రోజు దొంగతనం జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఇంటి ముందు వేసిన తాళం వేసినట్టుగానే ఉందని సీసీ కెమెరాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. లక్ష్మమ్మ భర్త చనిపోవడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటునే కిరాణా షాపు పెట్టుకొని జీవనం సాగిస్తుంది. ఈ నేపథ్యంలోనే లక్ష్మమ్మ లేని సమయాన్ని గమనించిన దొంగలు ఇంటిని కొల్లగొట్టి రూ.6లక్షలు దొంగిలించారు. సంఘటన తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీం సభ్యులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## ఐమాస్ట్ లైట్లకు మరమ్మతు పనులు

**ఘట్‌కేసర్, నవంబర్ 13, (ప్రభాతవార్త):** ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో పలుచోట్ల ఐమాస్ట్ లైట్లకు మరమ్మత్తు పనులు చేపట్టినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ తెలిపారు. కొండాపూర్, మాధవరెడ్డి వంతెన, కరీంగూడ రోడ్డు, ఇటుక్కుపోస్ట్ కాలనీలో వెలగని ఐమాస్ట్ లైట్లకు మున్సిపల్ విద్యుత్ సిబ్బందితో మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఐమాస్ట్ లైట్లు రోడ్ల పై రావడంతో లైట్లు వెలుగక చీకట్లో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. పట్టణంలో ప్రధాన రోడ్లపై ఉన్న అన్ని ఐమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేశామని తెలిపారు.

## ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ జడ్పీటీసీ దంపతులు

**కొత్తూర్, నవంబర్ 13, (ప్రభాతవార్త):** రాగ్యతండాలో లలితాంబికాదేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ పాల్గొన్నారు. కొత్తూర్ మండల పరిధిలోని మల్లాపూర్, రాగ్యతండాలో బుధవారం లలితాంబికాదేవి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. లలితాంబికాదేవి విగ్రహ ప్రతిష్టాపన కోసం కమిటీకి రూ.25వేల విరాళం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....లలితాంబికాదేవి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల నుండి దంపతులు ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం వివాహ వార్షికోత్సవం సందర్భంగా శ్రీలతసత్యనారాయణ గుడూర్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గుడూర్ మాజీ సర్పంచ్ సత్తయ్య, మల్లాపూర్ తాండ మాజీ సర్పంచ్ రవినాయక్, పేగూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ మున్నూర్ పద్మారావు, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగుకు శాస్త్రీయ పద్ధతులు



రైతులకు పత్రాలను అందజేసిన మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ తదితరులు

**శామీర్‌పేట, నవంబరు 13, ప్రభాతవార్త:** పంటల సాగుకు రైతులు సాంకేతికత, శాస్త్రీయ పద్ధతులను వాడాలని, భూసార పరీక్షలు చేసుకుని పంటల దిగుబడిని పెంచుకోవాలని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్ రైతులకు సూచించారు. బుధవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరంలో రైతులకు ఇక్రిశాట్ వారి ఆధ్వర్యంలో పంటల సాగుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్ మాట్లాడుతూ సాంకేతికత శాస్త్రీయ పద్ధతిలో కనుగొన్న యంత్రాల ద్వారా భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇస్తున్నందున వాటికి అనుగుణంగ వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను పాటించి రైతులు మంచి దిగుబడిని సాధించాలని, లాభాలను గడించాలని సూచించారు. ఇక్రిశాట్ వారు రైతుల శ్రేయస్సు కోసం భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇస్తున్నందున వాటిని పరిగణనలోకి తీసుకుని, ఏ పంటలు వేస్తే దిగుబడి అధికంగా వస్తుందనేది పత్రాల రూపంలో అందించటం జరిగిందని, రైతులు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇక్రిశాట్ అధికారులతో పాటు కేశవరం మాజీ ఎంపిటిసి గోనె హనుమంతరెడ్డి, రైతులు ఏలూరి కొమురయ్య, బొమ్మలపల్లి మల్లేశ్, ఉడతల కృష్ణగౌడ్, బలరాంచారి, శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మలపల్లి శ్రీశైలం, సుధాకర్, రామస్వామి, బొమ్మలపల్లి మైసయ్య, భూమేశ్‌గౌడ్, లక్ష్మినారాయణగౌడ్, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీత పంపిణీకి శ్రీకారం



భగవద్గీత పంపిణీ కార్యక్రమంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్

**శామీర్‌పేట, నవంబరు 13, ప్రభాతవార్త:** భగవద్గీతను ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమానికి కేశవరంలో శ్రీకారం చుట్టారు. బుధవారం మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలోని ఆలయంలో భగవద్గీత పంపిణీ కార్యక్రమం జరిగింది. అర్జునుడిని ఉద్ధరించటానికి ఉపదేశించింది మాత్రమే కాదని, ప్రతి మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దటానికి శ్రీకృష్ణుడు పూరించిన శంఖారావమని, మానసిక వికాస సూత్రాలను అందించాడని అందరు భగవద్గీతను చదవాలని ప్రముఖులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మాజీ ఎంపిటిసి జి.హనుమంతరెడ్డి, గ్రామస్థులు ఏలూరి కొమురయ్య, బొమ్మలపల్లి మల్లేశ్, ఉడతల కృష్ణగౌడ్, బలరాంచారి, శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మలపల్లి శ్రీశైలం, సుధాకర్, రామస్వామి, బొమ్మలపల్లి మైసయ్య, భూమేశ్‌గౌడ్, లక్ష్మినారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**శామీర్‌పేట, నవంబరు 13, ప్రభాతవార్త:** శామీర్‌పేట విద్యుత్ సెక్షన్ పరిధిలోని బొమ్మరాసిపేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని విద్యుత్ వినియోగదారులు గమనించాలని శామీర్‌పేట విద్యుత్ ఎఇ రాఘవేందర్‌రావు సూచించారు. శామీర్‌పేట మండలంలోని బాబగూడ, బొమ్మరాసిపేట్ గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించాలన్నారు. బాబగూడ, బొమ్మరాసిపేట్, జగ్గంగూడ రూట్, పెట్రోల్ బంకు రూట్ పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ పనుల చెట్ల కొమ్మల తొలగింపుతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గమనించాలని కోరారు.

## అయ్యప్ప మాలధారణ

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 13 :** షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో శ్రీ గిరీష్ సతీషన్ నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో భక్తులు అయ్యప్ప మాలను ధరించి, దీక్షను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య, గొల్ల రామరాజు యాదవ్, ఆకుల వీరేష్, ఆకుల నవీన్, చిద్దపురం శివ, లడ్డు, కోటిలింగం, మల్లేష్, అల్లాపురం వీరేశం, రఘు, రమేష్, పొగాకు సురేష్, నక్కల వెంకటేష్, ఆవుల నర్సింహ్మారెడ్డి, ఆలయ అర్చకులు సునీల్, మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దేముల్ ఆరోగ్యకేంద్రంలో మెరుగైన సేవలు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

**పెద్దేముల్, నవంబరు 13, ప్రభాతవార్త:** పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యుల సేవలు భేష్ అని జిల్లా వైద్యాదికారి వెంకటరమణ అన్నారు. బుధవారం పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి ఆసుపత్రిలోని రికార్డులను, మందులను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మందులు, మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. అనంతరం ఆసుపత్రికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయా, లేవా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో 170 రకాలు మెడిసిన్స్‌తో పాటు పాముకాటుకు గురైతే (అంటివెనిమ్) కుక్కకాటుకు కావలసిన (అంటి రేబిస్) మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. పెద్దేముల్ ఆరోగ్యకేంద్రంలో ఓపిల సంఖ్య బాగానే ఉందన్నారు. సిబ్బంది సైతం నిత్యం తమ డ్యూటీలకు హాజరవుతున్నట్లు గుర్తించారు. ఆరోగ్య కేంద్రానికి కావలసిన మౌలిక సదుపాయాలు ఏమైనా మిగిలి ఉంటే వెంటనే సమకూరుస్తామని అన్నారు. ఆరోగ్య కేంద్రానికి అవసరమైన సిబ్బందిని కేటాయిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఐఓ, డిడిఓ, డాక్టర్ బుచ్చిబాబు, వైద్యాధికారి వెంకట్‌సాయి, ఎంహెచ్ఎల్‌పిలు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షులుగా యాదగిరి



శామీర్‌పేట మండలాధ్యక్షులు రుద్రబోయిన యాదగిరిని సన్మానించిన నాయకులు

**శామీర్‌పేట, నవంబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం శామీర్‌పేట మండల అధ్యక్షులుగా రుద్రబోయిన యాదగిరి (తుర్కపల్లి) నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ సూచనల మేరకు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జిట్ట శ్రీనివాస్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. మండల అధ్యక్షులుగా యాదగిరి నియమితులు కావటంతో పలువురు నాయకులు పాల్గొని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనంతలక్ష్మి,మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, పరుశరాం, బండకింద ప్రసాద్, మూడుచింతలపల్లి మండల అధ్యక్షులు మంద స్వామి తదితరులు పాల్గొన్నారు. మండల అధ్యక్షులుగా నియమించినందుకు రాష్ట్ర, జిల్లా నాయకులకు రుద్రబోయిన యాదగిరి దన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవిని ఇచ్చినందుకు ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## కార్తీకమాస పూజల్లో మాజీ ఎమ్మెల్యే



కార్తీకమాస పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 13:** కేశంపేట గ్రామంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి మొదలుకొని కార్తీక శుద్ధ ద్వాదశి వరకు నిరంతరంగా జరిగే ద్వాదశి యజ్ఞ కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సమాజంలో ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

## రాజగోపురం నిర్మాణ పూజకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే శంకర్‌కు ఆహ్వానిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 13:** షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరం రాజగోపురం నిర్మాణ పూజకు రావాలంటూ దేవాలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు గుప్త ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ ఇలాంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందుకు దేవాలయ కమిటీని అభినందించారు. దేవాలయ అభవృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, దాస కృష్ణయ్య, దేవాలయ అర్చకులు రవిశర్మ, తదితరులు పాల్గొన్నారు.

## యువతికి పుస్తె మెట్టెలు అందజేత



**చౌడపూర్ నవంబరు 13 ప్రభాతవార్త:** చౌడపూర్ మండల పరిధిలోని మందిపాల్ గ్రామానికి చెందిన కావలి అంజయ్య , నర్సమ్మల కూతురు రాణి వివాహం 17వ తేదీన నిశ్చయమైంది.. మందిపాల్ గ్రామ కాంగ్రెస్ యువ నాయకులు సుగంశెట్టి మహేష్ సహకారంతో, విషయం తెలుసుకున్న హైదరాబాద్ గాయత్రి నగర్ కు చెందిన షాన్వి కన్స్రక్షన్ ఎం.డి. జైని లక్ష్మణ్, శ్వేత దంపతులు యువతిని వారి ఇంటికి పిలిపించి పుస్తె మెట్టెలు, చీర అందించారు.. పేద కుటుంబాలకు చెందిన యువతులు, అవసరమున్న వారి వివాహానికి మా వంతు సహకారం అందిస్తున్నామని లక్ష్మణ్ దంపతులు తెలిపారు.

## 11 మేకపిల్లలు మృత్యువాత

**మాడ్గుల, నవంబర్ 13, ప్రభాతవార్త:** కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి చెందిన సంఘటన మాడ్గుల మండలం పల్లె తండ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన హనుమంతు ఇంటివద్ద దొడ్డిలో మేకపిల్లల్ని ఉంచాడు. మేకలని పొలానికి తీసుకెళ్లాడు బుధవారం కుక్కలు మందపై దాడిచేసి 11 మేక పిల్లల్ని చంపేశాయి. సాయంత్రం హనుమంతు దొడ్డి వద్దకు వెళ్లగా కుక్కలు అతడిపై కూడా దాడి చేయడానికి యత్నించగా వాటి బారినుంచి తప్పించుకున్నాడు. మృతిచెందిన 11 మేకపిల్లలు విలువ దాదాపు రూ.50వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని హనుమంతు కోరాడు. పల్లెతండలో కుక్కలబెడదతో ప్రజలు, రైతులు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. కుక్కల బారినుంచి దూడలు, గొర్రెలు, మేకలను కాపాడాలని అధికారులను కోరుతున్నారు.

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**మాడ్గుల, నవంబర్ 13, ప్రభాతవార్త:** దళారులకు ధ్యానం అమ్మి నష్టపోవద్దని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే వరి ధాన్యం అమ్ముకోవాలని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం మాడ్గుల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకున్నదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేసామని, పాసు బుక్కు, ఆధార్ కార్డు తప్పొప్పులు ఉన్నాయి. సరిచేసి అవి కూడా రుణమాఫీ బ్యాంకు అధికారులు త్వరలోనే పూర్తి చేస్తారని తెలిపారు. రైతులను ఆదుకోవాలని దృష్టిలో ఉంచుకొని మొదట్లోనే రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయాలన్న సంకల్పంతో ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకున్న దాఖలు లేవన్నారు. రైతుల గురించి మాట్లాడే హక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు. ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయడమే కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఇచ్చినమాట ప్రకారం ఒక్కొక్కటి అన్ని నెరవేరుస్తున్నామన్నారు. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. రైతులకు అన్ని విధాలుగా మాప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు గౌరవరం ప్రభాకర్ రెడ్డి పిఏసిఎస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, డైరెక్టర్లు రాజవర్ధన్ రెడ్డి, కొప్పుల జగన్ గౌడ్, జగపాల్ రెడ్డి వెంకటయ్య గౌడ్, ఎంపీడీవో పద్మావతి, వ్యవసాయ అధికారి అరుణకుమారి, ఇన్స్పెక్టర్ జగదీష్,మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు, కరుణమ్మ, యాదమ్మ, సీసీలు పోచయ్య, యాదయ్య, శ్రీశైలం, వెంకటయ్య, మల్లేష్,రాములు, వివో ఏలు నర్మదా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు జిఓ ప్రకారం జీతాలు



**అత్తాపూర్ నవంబరు13,ప్రభాతవార్త:** వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వాలు ఇచ్చిన జి.ఓ.ని అమలు చేయకపోవడం బాధకరమని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ రాజేంద్రనగర్ డివిజన్ జర్నల్ మేనేజర్ సాయిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కార్మికులకు జీ.ఓ.ఎమ్మెస్ నెంబర్ 60 ప్రకారం వాటర్ సప్లై విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రూ,19500/లు, కంప్యూటర్ ఆపరేటర్స్‌కు రూ,,22,750/లు కనీస వేతనాలు అమలు చేయాలి. ఈ జీ.ఓ.ని గత ప్రభుత్వం తేదీ: 11/07/2021 నాడు విడుదల చేసిందని అప్పటినుండి ఇప్పటివరకు రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు అమలు చేయడం లేదు ఇప్పటికైనా అధికారులు స్పందించి జీ.ఓ నెంబర్ 60 ని వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికులు గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నటువంటి అనుబంధ సంఘంలో టి.ఆర్.ఎస్.వీ.కే లో ఉన్నారు. కానీ కార్మికులను పట్టించుకున్న దాఖలాలు లేవు ఇప్పుడు కార్మికులు ఏఐటియుసి నాయకులను సంప్రతించడం జరిగిందన్నారు. చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నారని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కార్మికుల వేతనాలు పెంచకుండా అధికారులు నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన 2021 సంవత్సరంలో ఇచ్చిన జీవో అమలు చేసి అప్పటి నుండి ఏరియస్ కూడా కార్మికులకు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీ.వో.ని అమలు చేయకుంటే రాజేంద్రనగర్ డివిజన్ వాటర్ వర్క్స్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.మహేందర్, శ్రీనివాస్ రెడ్డి, చెన్నకేశవులు గౌడ్, ప్రవీణ్ యాదవ్, రామకృష్ణ, రమల, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలే ఆదర్శం



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న దాతలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 13:** షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం అందరికీ ఆదర్శం కావాలని, ప్రతిచోట విద్యకు పెద్దపీట వేస్తూ పౌరులు ముందుకు సాగాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలుసుకున్న పట్టణ యాదవ మహాసభ నేత నడికుడ రఘునాథ్ యాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి తదితరులు నూతన భవన నిర్మాణం కోసం తమవంతు ఆర్థిక సహాయం అందించారు. యాదవ మహాసభ నేత రఘునాథ్ యాదవ్ రూ.1 లక్ష 11 వేలు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి ఒక లక్ష రూపాయల చెక్కులను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కళాశాల భవనం కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించడం గొప్ప విషయమని అన్నారు. దాతలు ముందకురావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు సదుపాయాలను కల్పించడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదయ్య యాదవ్, బక్కన్న యాదవ్, దంగు శ్రీనివాస్ యాదవ్, గున్న భీమయ్య యాదవ్, మహ్మద్ అలీఖాన్ బాబర్, రఘు నాయక్, చెంది తిరపతి రెడ్డి, గోద మాధవులు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

**కుల్కచర్ల/పరిగి, నవంబర్ 13, ప్రభాతవార్త:** ఫార్మా రైతులపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని బహుజన ముక్తి పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పాత్లావత్ గట్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కుల్కచర్ల మండలంలో ఆయన మాట్లాడుతూ, దేశానికి అన్నం పెట్టే రైతులను, వారి జీవనాధారమైన భూమిని లాక్కోవడానికి ప్రయత్నం చెయ్యడమే కాకుండా వారిని రెచ్చగొట్టేలా అగ్గువ సగ్గువ ప్యాకేజీలు మాట్లాడటంతోనే రైతులు తమ ఆత్మాభిమానాన్ని చంపుకోలేక ఉన్న భూమిని విడువలేక ఆవేదనతో అధికారులతో మాట్లాడే సందర్భాన్ని ఒక దాడిగా వర్ణించి, ఆ ఘటనకు రాజకీయ రంగు పులిమి గోరంతదాన్ని కొండంత చేసి దాన్ని భూతద్దంలో చూపెట్టి రైతులు ద్రోహులు అనడం ప్రభుత్వ నీతి మాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. సోమవారం అర్ధరాత్రి 28 మందిని అరెస్టు చేసి, రెండు రోజులు పరిగి పోలీస్ స్టేషన్ లో చిత్రహింసలు పెట్టి మంగళవారం రాత్రి 12 గంటలకు పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ టెస్టులు చేసి కొడంగల్ కోర్టులో ప్రవేశ పెట్టడం ఎంతవరకు న్యాయమని అన్నారు. మిగతావారు ఏమయ్యారో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగినప్పుడు స్వయంగా ఉన్న గౌరవ జిల్లా కలెక్టర్ గారే ఇది అ ఎకోకుండా జరిగింది తప్ప ఉద్యేశ్య పూర్వకంగా జరగలేదని ప్రకటన చేసినా ప్రభుత్వం ఎందుకు ఆ ఘటన ం పెద్దదిగా చేస్తుందో చెప్పాలని అడిగారు.కలెక్టర్ గారు ఈ జిల్లాకు మేజిస్ట్రేట్ అని కూడా గుర్తుచేశారు. మరి మేజిస్ట్రేట్ గారి ప్రకటన లేదా నిర్ధారణ కూడ పరిగణనలోకి తీసుకోరా అని ప్రశ్నించారు. గౌరవ ముఖ్యమంత్రి గారు దీనిని పరువు సమస్యగా చూడకుండా అక్కడి రైతుల జీవన్మరణ సమస్యగా చూడాలని, వెంబడే అక్రమ కేసుల ం, వేధింపుల ం ఆపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో లంబాడి ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఎంపీ చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జి గోవింద్ నాయక్, బీఎంపీ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నేనావత్ హరి నాయక్, బీఎంపీ దోమ మండల అధ్యక్షులు రవీందర్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సహాయం

**కుల్కచర్ల, నవంబర్ 13, ప్రభాతవార్త:** కుల్కచర్ల మండల వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు అంతా ఇల్లు కాలిపోయి దినావస్థలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య కు ఆర్థిక సహాయం అందజేయడం సంతోషకరమని ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం మండల అధ్యక్షుడు బర్ల నర్సింలు అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి ఇంట్లో ఉన్న ఆహార ధాన్యాలు వంట సామాగ్రి బట్టలు సర్టిఫికెట్లు కాలిపోవడంతో కుల్కచర్ల మండల ఎంపీ ఓ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో మండల పంచాయతీ కార్యదర్శులు బాధిత కుటుంబానికి ఎంపీడీవో రామకృష్ణ చేతులమీదుగా 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం మండల అధ్యక్షుడు బర్ల నరసింహులు మాట్లాడుతూ పేద కుటుంబమైన బండ వెల్కిచర్ల ఫీల్డ్ అసిస్టెంట్ కే నర్సింలు కు పంచాయతీకి అ ఎసంధానమైన ప్రజలకు వారధిగా నిలుస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి సహాయం అందించడం మరిచిపోమని మండల ఫీల్డ్ అసిస్టెంట్ల తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు జంబు వెంకటయ్య,కేశవులు, చంద్రమౌళి, రఘురాములు,అనంతయ్య,శ్రీనివాస్, బీరయ్య,భీమయ్య.యాదయ్య,రెడ్య , ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన వ్యక్తి అప్పగింత



తప్పిపోయిన యువకుడిని కటుంబీకులకు అప్పగించిన దాదాపూర్ యువకులు

**దోమ, నవంబర్ 13, ప్రభాతవార్త:** తప్పిపోయిన యువకుడిని అతడి కుటుంబీకులకు అప్పగించిన సంఘటన మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు యువకులు తెలిపిన వివరాల ప్రకారం చత్తిడ్‌గడ్ రాష్ట్రానికి చెందిన మంగేష్కర్‌ఠాకూర్ మానసిక రుగ్మతతో బాదపడి గత 9 నెలల క్రితం తమిళనాడులోని కోయంబత్తూర్ నగరంలోని ఒక ఉత్సవ కార్యక్రమానికి వచ్చారు. కుటుంబముతో కలిసి వచ్చిన మంగేష్కర్ మతిస్తిమితం బాగాలేక తప్పిపోయాడు. అప్పటినుండి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటింబికులు పోలిసులకు పిర్యాదు చేసి తమ స్వంత రాష్ట్రానికి వెళ్ళిపోయారు. బుదవారం నాడు దాదాపూర్ గ్రామములో అనుమానస్పద స్తితిలో తిరుగుతున్న వ్యక్తిని దాదాపూర్ గ్రామ యువకులు ప్రశ్నించి వివరాలు సేకరించగా చత్తిస్‌గడ్ రాష్టానికి చెందిన దుర్గ్‌జిల్లా డియస్‌పి కార్యాలయంలో పనిచేస్తున్న తప్పిపోయినవ్యక్తి అన్న విశాల్ ఠాకూర్‌కు జిల్లా పోలిస్‌అదికారి ఆద్వర్యములో మంగేష్కర్‌ను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. తొమ్మిది నెలల తరువాత వారి కుటుంబసభ్యులకు అప్పగించడముతో తల్లిదండ్రులు సంతోశించి దాదాపూర్ గ్రామయువకులను సన్మానించి పదివేలు పారిశోతకం అందజేశారు.

## బిఆర్ఎస్ నేతల అరెస్టు అప్రజాస్వామికం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 13:** తమ భూములను లాక్కోవద్దని ప్రజాస్వామ్య పద్దతిలో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు సిద్ధమైన లగచర్ల రైతులను రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వం ప్రయత్నించి, చివరకు ఆ ప్రజాస్వామిక పద్దతిలో రైతులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు బాసటగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులను కూడా అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ఫార్మాసిటీ పేరుతో పేద రైతుల భూములను గుంజుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదని వాపోయారు. అభివద్ధిని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటారనే విషయాన్ని ప్రభుత్వం గ్రహించాలని, కానీ ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగే విధంగా, వాళ్ల బతుకులు రోడ్డున పడేవిధంగా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదనే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. గత కొన్నాళ్లుగా కొడంగల్ నియోజకవర్గ ప్రజలు ఫార్మాసిటీని వ్యతిరేఖిస్తుంటే ప్రభుత్వం ఎందుకు వెనకకు తగ్గడం లేదని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల రైతులు తమ భూములను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, అన్నం పెట్టే భూములను వదులుకుంటే రైతు కుటుంబాలు ఏమైపోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు.కొని ఫార్మాసిటీ ఏర్పాటు విషయంలో పునరాలోచన చేసుకోవాలని, రైతులను, ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు.

## మైనర్ బాలికను రేప్ చేసిన నిందితుడికి జైలుశిక్ష

**చేవెళ్ల నవంబరు 13, ప్రభాతవార్త:** మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి మైనర్ బాలికను రెప్ చేసిన నిందితుడికి 20 సంవత్సరాలు జైలుశిక్షతో పాటు రూ.25000 వేల జరిమానాను విధిస్తూ ఎల్‌బినగర్ స్పెషల్ ఫోక్స్ కోర్టు మెజిస్ట్రేట్ హరిషా సంచలన తీర్పునిచ్చారని చేవెళ్ల సిఐ శ్రీధర్ భూపాల్ తెలిపారు. వికారాబాద్ జిల్లా పుదూర్ మండలం బాకాపూర్ గ్రామానికి చెందిన వడ్డె ప్రకాష్ (27) మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి రేప్ చేశాడని చేవెళ్ల పోలీస్ స్టెషన్ పరిధిలో క్రైం నంబర్ 56/2016తో కెసు నమోదు చేశారని తెలిపారు. కేసును పూర్తిస్థాయిలో విచారణ చేసిన పోలీసులు కోర్టుకు నివేదిక అందించారు. కేసును అడిషనల్ పిపిలు కోమాలత, నరేష్‌లు వాదించారు. కేసుకు సంబంధించిన వివరాలను డిసిపి టి.స్వామి, విజిలెన్స్ సూపరిండెంట్ శృతకీర్తిలు సమర్పించారు. కేసును పూర్తిస్థాయిలో విచారణ చేసి సాక్షాధారాలు బలంగా ఉండటంతో నిందితుడు ప్రకాష్ రేప్ చేశాడని నిరూపణ కావడంతో ఎల్‌బినగర్ స్పెషల్ ఫోక్స్ కోర్టు మెజిస్ట్రేట్ హరిషా తీర్పునిచ్చారని తెలిపారు. నిందితుడికి 20 సంవత్సరాలు జైలుశిక్షతో పాటు 25000 వేల రూపాయల జరిమానాను విధిస్తూ తీర్పునిచ్చారని తెలిపారు. కేసును ఎప్పటికప్పుడు కోర్టుకు పిసి దయాకర్ రెడ్డి, కేసులో ఉన్నవారికి సమన్‌లను కానిస్టెబుల్ విజయకుమార్, కేసుకు సంబంధించిన వివరాలు పూర్తిగా కోర్టుకు మహిళ ఎఎస్ఐలు పంకజా, అలివేలు అందజేశారు. కేసు యొక్క పూర్తి వివరాలను పరిశీలించిన ఎల్‌బినగర్ స్పెషల్ ఫోక్స్ కోర్టు మెజిస్ట్రెట్ హరిషా నిందితుడుకి జైలుశిక్షను విధిస్తూ తీర్పును వెల్లడించారు.

## రాష్ట్రంలో ఎప్పుడు కలెక్టర్‌పై దాడులు జరుగలేదు

**చేవెళ్ల నవంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎప్పుడు కలెక్టర్‌పై దాడులు జరుగలేదని, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య డిమాండ్ చేశారు. బుదవారం చేవెళ్ల ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులపై దాడుల చేయడం విచారకమన్నారు. గతంలో ప్రభుత్వాలు రైతుల నుండి భూసేకరణ చేసినప్పటికీ ఇలాంటి దాడులు మాత్రం జరుగలేదన్నారు. దాడులు చేసిన వారు ఎంతటి వారైనా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులకు ప్రభుత్వం తగు న్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వానికి రైతులు, ప్రజలు సహకరించాలి తప్పా ఇలా దాడులకు పాల్పడకూడదన్నారు.

## ఎంపిని అడ్డుకోవడం బాధాకరం



సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 13:** రైతులను పరామర్శించడానికి వెళ్తున్న ఉమ్మడి పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డి.కె.అరుణను మన్నెగూడలో పోలీసులు అడ్డుకోవడం బాధాకరమని, ఇది సిగ్గుచేటని, ఎంపిని పోలీసులు అడ్డుకోవడాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల చేత ఎన్నుకోబడిన పార్లమెంటు సభ్యురాలు డి.కె.అరుణ. ఆమె పార్లమెంటు నియోజకవర్గంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందని ముఖ్యమంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. అదే నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సోదరుడు వెళితే లేని అడ్డంకులు ఎంపి అరుణమ్మకు ఎందుకన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, చేగు సుధాకర్, అత్తాపూర్ మహేందర్‌రెడ్డి, ఆనెమోని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి శివభక్తుల సహాయం

**ఆమనగల్లు, నవంబరు 13, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణానికి చెందిన శివభక్తుడు ఇందూరి మహేశ్ అనారోగ్యంతో ఇటీవల కన్నుమూసాడు. పట్టణానికి చెందిన శివభక్తులు బుధవారం మృతుని కుటుంబాన్ని కలిసి, తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం పరిచారు. అనంతరం భక్తులు పోగు చేసుకున్న రూ. 22వేల రూపాయలను మృతుని తల్లిదండ్రులు ఇందూరి యాదమ్మ మల్లేశ్‌లకు అందజేశారు. చనిపోయిన ఇందూరి మహేశ్‌తో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని కుటుంబసభ్యుల ముందు వ్యక్తపరిచి ఆవేదన వ్యక్తం చేశారు. కాగా గత కొన్ని నెలల క్రితం కూడా శివమాలను ధరించిన భక్తుడు ఒకరు చనిపోవడంతో ఆయన కుటుంబానికి వీరంతా ఆర్థిక సహాయం అందజేశారు. ఇందూరి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం పట్ల పట్టణప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భక్తులు సహేర శ్రీను, బిట్టి సాయిలు, గుండ్రాతి కుమార్‌గౌడ్, నాగిళ్ళ శ్రీను, నాగిళ్ళ జగన్, లింగంపల్లి అశోక్, బివిఆర్, పద్మప్రశాంత్, మేదరి శ్రీను, దుర్గాప్రసాద్, దేవరాజు, గన్నోజు రాజశేఖర్, సత్యం, మద్దూరి నరేష్, బాలు, శివ, మహేశ్, మహేందర్, బొల్లు గణేశ్, గుండె యాదయ్య, నాగిళ్ళ అమర్, కృష్ణ, నాగిళ్ళ అశోక్, వెంకటేశ్, శ్రీను, బుల్లెట్ శివ తదితరులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ చట్టవిరుద్ధం

**చేవెళ్ల, నవంబరు 13, ప్రభాతవార్త:** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధమని, బిఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని చేవెళ్ల మండల బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నత్తి క్రిష్ణారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం చేవెళ్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేవెళ్ల మండల బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నత్తి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటిని వద్దని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం బిఆర్‌ఎస్ నాయకులను టార్గెట్ చేస్తుందన్నారు. ప్రజలకు జీవనాధారమైన భూములను బలవంతంగా లాక్కుంటే రైతులు ఊరుకోరని, ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తారన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయాలని, ప్రజలపై అక్రమకేసులు పెట్టకూడదన్నారు. బిఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తే మాత్రం సహించేదిలేదని పేర్కొన్నారు.

## పాలకవర్గం సేవాభావంతో పనిచేయాలి



ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న ఛైర్మన్ సభ్యులు

**నవాబుపేట నవంబరు 13 ప్రభాతవార్త:** ఇటీవల కొలువు దీరిన మండల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బుధవారం చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఛైర్మన్ గీతాసింగ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో సహితం సన్నిహితంగా మెలగాలని చెప్పారు. మండల మార్కెట్ కమిటీని నియమించినందుకు వారు సిఎం రేవంత్ రెడ్డికి, సంబంధిత మంత్రులకు, ఎమ్మెల్యే యాదయ్యకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బల్వంత్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులకు సహకరించాలి



సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్

**జిల్లేడు చౌదరిగూడ, నవంబరు 13, (ప్రభాతవార్త):** గ్రామాలలో సర్వే చేస్తున్న అధికారులకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లేడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న సర్వే వివరాలను సంబంధిత అధికారులనడిగి తెలుసుకున్నారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారి పూర్తి వివరాలను సంబంధిత ఫారాలలో నింపాలని ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా అందజేసిన ధృవ పత్రాలలో మాత్రమే సర్వే వివరాలు నింపాలని అన్నారు. ప్రజలు తెలిపిన వివరాలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారులు విధులు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

# దిష్టిబొమ్మగా మిగిలిన శిలాఫలకం



శిలాఫలకానికే పరిమితమైన వసతిగృహం

**నవాబుపేట నవంబరు 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జడ్పీ జనరల్ ఫండ్ 20 లక్షల రూపాయలతో నిధులతో నిర్మించటానికి తలపెట్టిన జిల్లా పరిషత్ వసతిగృహం నిర్మాణానికి 2018 జూలై 31న ఆర్భాటంగా శిలాఫలకం ఏర్పాటుచేసి చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరుల చేత భూమిపూజ చేయించి, వదిలేశారు. దీంతో శిలాఫలకం దిష్టిబొమ్మలా మారిపోయింది. అదే విధంగా ఇదే ప్రాంగణంలో అంబేద్కర్ భవన్ కూడా నిర్మాణం చేయనున్నట్లు ప్రకటించారు. కాని నేటికీ ఈ నిర్మాణాల ఊసే లేదు. కనీసం సంబంధిత అధికారులకు ఈ విషయం గుర్తుందా? లేదా? అనేది ప్రశ్నగా మిగిలింది. నెలలు ఆలస్యమవడం రివాజు, ఏకంగా సంవత్సరాలు గడిచిపోవడం విడ్డూరమేనని పరిశీలకులు భావిస్తున్నారు. వసతి గృహం అనివార్యమని, పలువురు భావిస్తున్నారు. గతంలో అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అర ఎకరం వరకు స్థలాన్ని గుర్తించారు. నిర్మాణం విషయంలో తగిన స్పష్టత లేకపోవడంతో స్థలాన్ని కళాశాల కంపౌండ్‌లో కలిపేశారు. దీంతో వసతిగృహం పరిసరాల్లోనే నిర్మాణం చేయాలని నాయకులు, అధికారులు భావించారు. తర్వాత మొత్తానికే మరిచిపోయారు. స్థానిక ఎమ్మెల్యే అంబేద్కర్ భవన్ నిర్మాణం తథ్యమని భావించిన నేపథ్యంలో ఆలస్యం జరగడమే కాకుండా మొత్తానికి విషయమే మర్చిపోవడం విచారకరమని అంబేద్కర్ అభిమానులు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శిలాఫలకాలను గౌరవించి పనుల విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు అసమంజసం

**కోట్‌పల్లి, నవంబరు 13 ప్రభాతవార్త;** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడం సమంజసం కాదని కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉప్పరి మహేందర్ అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో అయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటి కంపెనీ వద్దని భూములు కోల్పోతున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బిఆర్‌ఎస్ పార్టీ నాయకులను టార్గెట్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. గ్రామంలో అన్నివర్గాలకు సంబంధించిన ప్రజలు ఉంటార న్నారు. ప్రజలభూములు, నివసించే గూడు ప్రభు త్వం లాక్కుంటే, ప్రజలకు అన్యాయం జరుగు తుంటే ప్రజలే తిరగబడతారన్నారు. ప్రభుత్వం ప్రజల మేలు కోరాలి తప్ప, అక్రమ అరెస్టులు చేయకూడదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను, రైతులను మభ్యపెట్టి మోసంచేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాల న్నారు. రైతులకు ఇంకా రెండు లక్షల రూపాయలు రుణమాఫీ కాలేదన్నారు. అదేవిధంగా రైతులకు ఇంతవరకు పెట్టబడి సాయం కింద రైతుభరోసా అమలుచేసి రైతులను అదుకోవాలన్నారు. కావాలని బిఆర్‌ఎస్ పార్టీని నాయకులను టార్గెట్ చేయడం మంచి పద్ధతి కాదని వారు పేర్కొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, నవంబర్ 13, ప్రభాతవార్త:** విద్యుత్ పనుల నిర్వహణ కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ విద్యుత్ ఎఈ బి.బలరాం తెలిపారు. ఘట్‌కేసర్ 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్ర పరిధిలోని 11 కెవి ఘట్‌కేసర్ ఫీడర్ పరిధిలో డిటిఆర్ నిర్వహణ, చెట్లకొమ్మల తొలగింపులతో ఉదయం 11గంటల నుంచి సాయంత్ర ం 4గంటల వరకు పలుచోట్ల కరెంట్ ఉండదని తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణం, సాయినగర్, టీచర్స్ కాలనీ, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, అంబేద్కర్ నగర్, ఏదులాబాద్ రోడ్డు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, బుగ్గనగర్, బ్రూక్‌బాండ్ కాలనీ, లింగాలకుంటలో కరెంట్ ఉండదని అందరూ సహకరించాలన్నారు.

**నారపల్లి ఉపకేంద్రం పరిధిలో...**

పోచారం 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కెవి జోడిమెట్ల ఫీడర్ పరిధిలో అన్నానగర్, డాక్టర్స్ కాలనీ, జోడిమెట్ల చౌరస్తా, అరుంధతికాలనీ, హుడాకార్తీకేయ, కాకతీయనగర్, స్వర్ణగిరికాలనీ, వైష్ణవికాలనీ, చౌదరిగూడలో ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు పనుల కారణంగా కరెంట్ ఉండదని, పోచారం 11 కెవి ఫీడర్ పరిధిలోని పోచారం, డాక్టర్స్ కాలనీ, విజయసాయి ఎన్‌క్లేవ్‌లలో మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు కరెంట్ ఉండదని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

# కలెక్టర్‌పై దాడి వెనక బిఆర్‌ఎస్ గూండాలు

**షాద్‌నగర్ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతల ధ్వజం**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 13:** ఎన్నడూ లేని విధంగా బిఆర్‌ఎస్ పార్టీ కొత్త సంస్కృతిని పరిచయం చేస్తుందని, ప్రతిపక్షం అంటే దాడులు, దౌర్జన్యాలు. కుట్రలు, కుతంత్రాలతో రాష్ట్రంలో శాంతిభద్రతల విచ్ఛిన్నానికి కుట్రలు చేస్తుందని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ధ్వజమెత్తారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ పి.రఘు, పిసిసి సభ్యులు మహ్మద్ అలీఖాన్ బాబర్, సీనియర్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, కె. పురుషోత్తంరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్‌లు మాట్లాడారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి వెనుక బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిల పాత్ర ఉందంటూ, సమావేశంలో ఆరోపణలు చేశారు. కలెక్టర్‌పై దాడికి బిఆర్‌ఎస్ అక్కడి స్థానిక నాయకుడు సురేష్‌తో పథకం రచించి రైతులను, ప్రజలను రెచ్చగొట్టి కలెక్టర్, తదితర అధికారులపై దాడులు చేశారని ఆరోపించారు. కొడంగల్ ఫార్మా భూముల ఉద్యమం వెనక బిఆర్‌ఎస్ పార్టీ ఉందని అన్నారు. కలెక్టర్‌పై దాడికి పక్కా స్కెచ్ వేసిన బిఆర్‌ఎస్ గూండాల భరతం పడతామని హెచ్చరించారు. బిఆర్‌ఎస్ సర్కార్ కూలి పది నెలలు గడిచినప్పటికీ, కాంగ్రెస్ అభివృద్ధి చూడలేక కుట్రలు పన్నుతుందని విమర్శించారు. ప్రతి పని వెనక పక్కాగా స్కెచ్ గీసి దాడులకు, అల్లర్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ నేతల ఉడత ఊపులకు భయపడమని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా, మూసీ, కులగణన, కొడంగల్, కేశంపేట ఘటనల వెనుక బిఆర్‌ఎస్ కుట్రలు చేసిందని ఈ సందర్భంగా శాంతిభద్రతల విఘాతానికి పాల్పడిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. తాము దాడులు, దౌర్జన్యాలకు తెగిస్తే బిఆర్‌ఎస్ నాయకులు బయట తిరగలేరని హెచ్చరించారు. ప్రతిపక్షం బాధ్యతాయుతంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. తాము ఆందోళనలను, నిరసనలను అణచివేయలేదని, ప్రతిపక్షానికి ఎంతో స్వేచ్ఛ ఇచ్చామని, కానీ ఆ స్వేచ్ఛను తప్పుదారిలో పెడుతూ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, దీనికి వికారాబాద్ కలెక్టర్‌పై దాడి ఘటన నిదర్శనమన్నారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**చేవెళ్ల, నవంబరు 13, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతంలోని పశువులకు సోకిన వ్యాధుల నివారణకు ఉచితంగా పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, ప్రజలు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల పశువైద్య అధికారిణి డాక్టర్ శిరీష సూచించారు. బుధవారం చేవెళ్ల మండలం పామెన గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల పశువైద్య అధికారిణి డాక్టర్ శిరీష మాట్లాడుతూ పశువులకు నట్టల నివారణ మందులు, చూడి పరీక్షలు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేస్తున్నామన్నారు. పశువులకు సోకివ వ్యాధులకు చికిత్సలు చేసేందుకు వైద్యులు నిత్యం అందుబాటులో ఉన్నారన్నారు. పశువులకు సోకుతున్న వ్యాధులకు మందులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతంలోని రైతులు పశువైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ జయసుధ, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ప్రభుత్వం

**చేవెళ్ల నవంబరు 13, ప్రభాతవార్త:** నిరుపేద ప్రజలకు అండగా ప్రభుత్వం ఉందని, ఆర్థిక స్తోమత లేని ప్రజలకు సిఎం సహాయనిధి ఎంతగానో సహాయపడుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడించారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయ నిధి కింద మంజూరైన నిధుల చెక్కులను అందజేశారు. నియోజవకర్గంలోని 99 మంది లబ్దిదారులకు 43 లక్షల 37 వేల రపాయలను అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం పాటుపడుతుందని, ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, చేవెళ్ల మార్కెట్ కమిటి ఛైర్మన్ పెంటయ్యగౌడ్, చేవెళ్ల సహకార సంఘం ఛైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ముడిమ్యాల సహకార సంఘం ఛైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, ముడిమ్యాల మాజీ సర్పంచ్ పడాల ప్రబాకర్, చేవెళ్ల మండల సీనియర్ నాయకులు మర్పల్లి క్రిష్ణారెడ్డి, అగిరెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజాపాలనపై బిఆర్‌ఎస్ కుట్రలు

**-టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్**



విలేకరులతో మాట్లాడుతున్న టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్

**ఆమనగల్లు, నవంబరు 14, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల తెలంగాణ ప్రజానీకానికి పెరుగు తున్న విశ్వాసాన్ని చూసి ఓర్వలేకనే బిఆర్‌ఎస్ పార్టీ నేతలు సిఎం రేవంత్‌రెడ్డి సర్కారుపై అర్థరహిత ఆరోపణలు, అసంబంధ చర్యలతో కుట్రలు పన్నుతున్నారని టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బిఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పినా బుద్ధి రాలేదని, అధికార దాహంతో బిఆర్‌ఎస్ అధినేతలు స్వప్రయోజనాలు, ఉనికిని కాపాడుకునేందుకు చేస్తున్న అరచాకాలు, కుట్రలను తెలంగాణ ప్రజలు తిప్పికొట్టే సమయం ఆసన్నమైందని ఆయన దుయ్యబట్టారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లగ్రామంలో జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులపై దాడుల ఘటన దురదృష్టకరమని, దాడుల వెనుక బిఆర్‌ఎస్ శక్తులు దాగి ఉన్నాయని, ఆ ఘటనలో మాజీ ఎమ్మెల్యే హస్తం ఉన్నట్లు వార్తలు రావడం అందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. అమాయక ప్రజలను రెచ్చగొడుతూ నీతితప్పిన సిద్ధాంతాలతో బిఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అరాచక చర్యలు ప్రజాస్వామ్యానికే మచ్చుతునకగా నిలుస్తున్నాయని ఆయిళ్ళ ఘాటుగా విమర్శించారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ఆలోచన తప్ప ఎటువంటి స్వప్రయోజనాలు లేవన్నారు. బుధవారం ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ళ బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ ప్రజలు పూర్తిగా దగా పడ్డారని, లక్షల కోట్లు అప్పులు తప్ప కెసిఆర్ సర్కారు సాధించిందేమి లేదని విమర్శించారు. అధికార దుర్వినియోగంతో రాచరిక జీవితాలను అనుభవించిన కల్వకుంట్ల కుటుంబం నేడు అధికారం దూరమయ్యేసరికి జీర్ణించుకోలేక రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు పన్నాగాలు పన్నుతుందని ఆరోపించారు. తెలంగాణ సర్కారును అస్థిరపరచడానికి ఎన్నికుట్రలు చేసినా ప్రజలు విశ్వసించలేరని, కల్వకుంట్ల కుట్రలను తెలంగాణ ప్రజలు ఛీకొడుతున్నారన్న విషయాన్ని వారు గుర్తించాలన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంటుందన్నారు. తెలంగాణ పునర్‌నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తూనే ఉంటుందని ఆయిళ్ళ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

## స్వశక్తితో యువత ముందుకు...



నిర్వాహకుడిని అభినందిస్తున్న జర్నలిస్టులు, తదితరులు

**షాద్‌నగర్ రూరల్, నవంబరు 13, (ప్రభాతవార్త):** నేటి యువత ప్రభుత్వ ఉద్యోగాల గురించి ఆలోచించకుండా నచ్చిన రంగాన్ని ఎంచుకొని స్వశక్తితో ముందుకు సాగుతున్నారు. బుధవారం పట్టణంలోని పరిగి రోడ్డులో నిర్వాహకుడు నందు ఫోమ్ వాటర్ వాషింగ్ సెంటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు కెపి ముఖ్యఅతిథిగా హాజరై నిర్వాహకుడిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నిర్వాహకుడికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో జర్నలిస్టులు రఘు, శ్రీశైలం, సంజీవరెడ్డి, గండి మహేష్, ప్రతాప్‌రెడ్డి, సందీప్, చైతన్యరెడ్డి, సతీష్ రెడ్డి, మోహన్ చారి, రమేష్ గౌడ్, కమలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**మర్పల్లి నవంబరు 13 ప్రభాతవార్త:** మర్పల్లి మండల పరిధిలోని రావులపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి అనుసుజ మంగళవారం రాత్రి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌కెఆర్ ట్రస్ట్ వ్యవ స్థాపకులు సనగారి కొండల్‌రెడ్డి మృతురాలి అంత్యక్రియలకు 5వేల రూపాయలు పంపగా గ్రామ పెద్దలు అబ్రం, నర్సింలు గ్రామస్థులతో కలసి మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్‌కెఆర్ పంపిన 5వేల రూపాయలను వారికి అందజేశారు.

## పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి



10వ జోనల్ గేమ్స్ మీట్ ఆటల పోటీల కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 13:** విద్యార్థులు తమలోని పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని, అదేవిధంగా నైపుణ్యాన్ని క్రీడల్లో ప్రదర్శించాలని కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కె.విద్యుల్లత అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న 10వ జోనల్ గేమ్స్ మీట్ ఆటల పోటీల కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులు ఆయా పోటీల్లో పాల్గొన్నారు. ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, షార్ట్‌పుట్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్, లాంగ్ జంప్, హై జంప్, రన్నింగ్ విభాగాలలో అపూర్వ ప్రదర్శన చేశారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ విద్యుల్లత మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా పోటీల్లో విజయం సాధించిన వారిని అభినందించడమే కాకుండా ఓటమి పాలైన వారిని కూడా ఉత్సాహపరుస్తూ పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించినట్లు తెలిపారు. క్రీడాకారులైన విద్యార్థుల్లో ఇతర ప్రిన్సిపల్స్, ఎస్కార్ట్ టీచర్లు నూతనోత్సాహాన్ని పెంపొందించినట్లు తెలిపారు. పిఈటి, పిడిలు కూడా చక్కని బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. విద్యార్థులందరినీ సమన్వయపరుస్తూ ఆహ్లాదకరమైన పోటీ తత్వాన్ని పెంచినట్లు వివరించారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడతా



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**చేవెళ్ల నవంబరు 13, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి పాటుపడుతానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వెల్లడించారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో గ్రామానికి వెళ్లే సిసి రోడ్డు నిర్మాణ పనులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ జిల్లా పరిషత్ కోటిరూపాయల నిధులతో సిసి రోడ్డు పనులు చేస్తున్నామన్నారు. గ్రామాలల్లో రోడ్లకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. చేవెళ్ల గ్రామం అభివృద్ధికి ఎన్ని నిధులైన మంజూరు చేస్తామన్నారు. చేవెళ్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం, చేవెళ్ల సహకార సంఘం ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, ముడిమ్యాల సహకార సంఘం ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ ఛైర్మన్ రాములు, డిసిసి ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మండల పార్టీ అద్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పిసిసి సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయుకులు మర్పల్లి క్రిష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి గుండాల రాములు, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, పోట్ట దయాకర్, జనార్ధన్, డిఈ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి




కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఎంసి ఛైర్మన్ విజయభాస్కర్ రెడ్డి

**ధారూర్, నవంబరు 13, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొత్తపల్లి విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు సాఫీగా కొనసాగేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాన్ సింగ్, వైస్ ఛైర్మన్ అశోక్, మాజీ జడ్పిటిసి రాములు, నాయకులు బాబా ఖాన్, అమరేశ్వర్, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు విజ్ఞప్తి

**షాద్‌నగర్‌రూరల్, నవంబరు 13, (ప్రభాతవార్త):** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని పత్తిరైతులు పండించిన పత్తి, పొలం వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోతే గ్రామ వ్యవసాయ విస్తరణాధికారి వద్ద పత్తి పండించినట్లు ధృవీకరణపత్రం తీసుకురావాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ బుధవారం ప్రకటించింది. ధృవీకరణపత్రంతో పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకొచ్చి మార్కెట్ కార్యాలయంలో సంప్రతించాలని పేర్కొన్నారు.